క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి

నడికూడ : మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ సెంటర్)ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఎలక్షన్ కోడ్ వలన ప్రారంభోత్సవం వాయిదా పడిందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీహెచ్‌సీ సెంటర్‌ను ఇతర చోటుకు తరలించేందుకు కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవ తీసుకొని పీహెచ్‌సీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : ఐనవోలు, గర్మిళ్లపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ పద్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, గర్మిళ్లపల్లి గృహ అవసరాలు, వ్యవసాయ కనెక్షన్‌లు, ఒంటిమామిడిపల్లి, లక్ష్మీపురం, సింగారం, పున్నేలు, ఉడుతగూడెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దశాబ్ది డిపాజిట్ పథకంతో అత్యధిక వడ్డీ



పరకాల : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం పాలసీ ద్వారా అత్యధిక వడ్డీ లభిస్తుందని మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి అన్నారు. మాదారం పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రచార రథం ,కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఖాతాదారులు, రైతులు డీసీసీబీ పరకాల బ్రాంచీలో డబ్బులు డిపాజిట్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ఘనంగా బోనాలు



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో ఆదివాసీలు పెద్దమ్మతల్లికి శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. తొలుత గ్రామంలోని ఆలయానికి మహిళలు బోనాలతో వెళ్లి పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నాయకులు శ్రీనివాస్, వట్టం పెరుమన్న, నర్సయ్య, సారంగపాణి, ప్రవీణ్, మునేందర్, ఈసం నర్సయ్య పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నర్సంపేట : పట్టణంలోని వరంగల్ రోడ్డు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ పానుగోటి గోపాల్, వేములపల్లి సుబ్బారావు, అధ్యక్షుడిగా నాగిశెట్టి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మోతె ఇంద్రసేనారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ పెండెం భాస్కర్, సభ్యులుగా వెంకట్, రాంరాజ్, భాస్కర్ రెడ్డి, సురేశ్, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడారు. నడక శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెప్పారు. గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ జిమ్, యోగా కేంద్రాల, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో హరితహారంతోపాటు పేదలకు విద్య, వైద్యపరమైన సేవలు అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ రవికృష్ణ, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, అమీన్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రభాకర్, భద్రు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

నర్సంపేట : ప్రగతి, మాంటిస్సోరీ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. ఆ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నరేశ్ ఆధ్వర్యంలోని బృందం విద్యాశాఖ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. నాయకులు ప్రశాంత్, వినోద్, రఘు ఉన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- నరకయాతన పడుతున్న వాహనదారులు
- మూగజీవాల అవస్థలు
- ఉనికిచర్ల వెళ్లాలంటే జంకుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ : మండల కేంద్రం నుంచి ఉనికిచర్ల వెళ్లే బీటి రోడ్డును సంవత్సరం క్రితం 4కిలో మీటర్లు నూతన బీటీ రోడ్డుగా పునర్‌నిర్మాణం చేసేందుకు పంచాయితీరాజ్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేశారు. ఈ క్రమంలో గతేడాది మార్చిలో అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేతుల మీదుగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ మేరకు సంబంధిత గుత్తేదారు అక్కడక్కడా పాత బీటీని తొలగించి కంకర పోశాడు. కానీ ఆ కంకరలో మిక్సింగ్ డస్ట్ లేకుండా, వాటర్ పట్టకుండా రోలింగ్ చేసి వదిలేశాడు. ఆరు నెలలుగా అర్ధాంతరంగా పనులు నిలిచిపోవడంతో రోడ్డుపై కంకర రాళ్లు పైకి తేలి కాలినడకకు సైతం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉనికిచర్ల గ్రామ ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఓఆర్ఆర్ జాతీయ రహదారి మీదుగా ధర్మసాగర్ గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ధర్మసాగర్, ఉనికిచర్ల గ్రామాల రైతుల వ్యవసాయ భూములు కూడా ఈ రోడ్డుకిరువైపుల ఉండడంతో రైతులు, పశువులు ఆ రోడ్డు మీదుగా నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై వాహనాలు నడుపుతుంటే అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై బీటీ వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



కంకరపై నుంచి వస్తున్న ట్రాక్టర్



రోడ్డుపై తేలిన కంకర

రోడ్డుపై నుంచి నడవలేక పోతున్నాం

రోడ్డుపై కంకర, రాళ్లు తేలిఉండడంతో ఆ రోడ్డుపై నడవలేకపోతున్నాం. ప్రస్తుతం వానాకాలం సీజన్ రావడంతో రాత్రిళ్లు కూడా వాహనాలపై బావుల వద్దకు వెళ్లి మోటార్లు ఆన్ చేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆ రోడ్డు మీదుగా వెళ్తుంటే కంకర గుచ్చుకొని బండి టైర్లు పంచర్ అవుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. కంకర్‌పై నడవడం ద్వారా పశువుల కాళ్ల డెక్కలు కూడా పైకి లేచి, అనారోగ్యానికి గురి అవుతున్నాయి.

- చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రైతు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఎల్కతుర్తి : బడిబాట చేపట్టిన ఉపాధ్యాయులు



ఐనవోలు : బడిబాటలో ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : మండలంలోని బావుపేట గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రతీ సబ్జెక్టుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయుడు ఉన్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించడంతో పాటు విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, నోట్‌బుక్స్, వారానికి 3 కోడిగుడ్లతో కూడిన పౌష్టికాహారం అందించబడుతుందని వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రియా, సునిత, రమాదేవి, రషీదా, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రెండోరోజు కొనసాగించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపించి డబ్బులు వృధా చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కాగా 13మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)ల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. ఏఏపీసీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు మధుకర్, బీమళ్ల సారయ్య, లక్ష్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సమ్మక్క, రేణుక, యశోద, దీపిక పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఆత్మకూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం ఇవ్వడం ఇస్తున్నామన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రం లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య విధానానికి, బానిసత్వం, వెట్టిచాకిరి, పటేల్ పట్వారీ తత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి 3000 గ్రామాలకు విముక్తి కల్పించారని గుర్తు చేశారు. పది లక్షల ఎకరాలు పేదలకు పంచిన చరిత్రను పాఠ్యాంశాల్లో లిఖించాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు సానుభూతిపరులు చందాలు ఇవ్వాలని కోరారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, లక్ష్మణ్, రవి, వెంకటేష్, రాజయ్య, బాబు, అంకూస్, వెంకన్న పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

బాప్టిస్ట్ సంస్థ ఆస్తులను అమ్మకూడదు

నయీంనగర్: హనుమకొండ మిషన్ ఆస్పత్రిని ఆనుకొని ఉన్న క్రైస్తవ సమాజానికి సంబంధించిన (బాప్టిస్ట్ సంస్థ) ఆస్తులను ఎవరూ అమ్మకూడదు, కొనకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ట్రిసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ జీ.జాన్ మార్కండేయ, చైర్మన్ రెవ డాక్టర్ దామెర ఐజాక్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లీజుకు తీసుకున్న భూమిని స్కూల్ వారు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఎఫ్ బాధ్యులు విద్యాకర్, టి.ప్రసంగి, ఇమ్మానుయేల్, వినయ్‌కుమార్, కారణ్, లాజరస్‌తో పాటు క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగును నివారించాలి

ఎల్కతుర్తి: పత్తిపంటలో వచ్చే గులాబీరంగు పురుగును నియంత్రించాలని నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధి వంగ రఘు సూచించారు. శుక్రవారం మండలంలోని పెంచికలపేట గ్రామంలో రైతులకు కార్గిల్ సంస్థ, సేఫర్డ్ సంస్థ సహకారంతో లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. గులాబీరంగు నివారణ కోసం పంట చేనులో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, పత్తి పండించే రైతులందరూ అధిక దిగుబడి సాధించాలంటే పురుగు నియంత్రణ అవసరమన్నారు. అందులో గులాబీరంగు పురుగు ఎక్కువగా నష్టపరుస్తదని సూచించారు. దీంతో పత్తి దిగుబడి తగ్గడంతో పాటు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పురుగు నియంత్రణ కోసం లింగాకర్షణ బుట్టలను గ్రామ రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని రైతులంతా పత్తి పెట్టిన 45 రోజులకు పంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో మగరెక్కల పురుగులను నియంత్రించవచ్చాన్నారు. లింగాకర్షణ బుట్టల ఏర్పాటుతో పురుగు ఉధ్రుతి తగ్గించవచ్చని సూచించారు. ఏఈఓ తిరుపతి, రైతు ఉత్పత్తిదారుల ప్రతినిధులు మౌనిక, రాజేందర్, లత పాల్గొన్నారు.



లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్న రఘు

'స్థానిక' ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

- బీజేపీ జిల్లా నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ యువతకు ప్రాధాన్యత ఇవ్వనుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు పరిధిలోని వల్లభ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలో యువతకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. సేవా దృక్పథం కలిగిన యువతను ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని వివరించారు. నియోజకవర్గ కన్వీనర్ నర్సింహరాములు, మహబూబాబాద్ పార్లమెంటు కోకన్వీనర్ రాంచందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు, 4వ వార్డు కౌన్సిలర్ రాంబాబు, 3వ వార్డు కౌన్సిలర్ భానోతు వీరన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్, యువ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకీస విఘేష్ గౌడ్, బూత్ కమిటీ అధ్యక్షులు నాగేందర్, ఠాకూర్ ప్రతిక్ష సింగ్, చిలువేరు అన్వేశ్, కుసుమ భవానీ శంకర్, నర్సంపేట సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సామల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

కాడెడ్లు కట్టి.. అచ్చుతోలి

- ఖరీఫ్ సాగులో నిమగ్నమైన రైతన్నలు
- పత్తి విత్తనాలు విత్తే బిజీలో కూలీలు

ఎల్కతుర్తి : పదిరోజుల క్రితం ట్రాక్టర్‌తో వేసవి పాడిదుక్కులు దున్ని వ్యవసాయ భూములను సాగుకు సన్నద్ధం చేసిన రైతన్నలు గురువారం కురిసిన తెలికపాటి వర్షానికి కాడెడ్లు కట్టి అచ్చుతోలి కూలీల సాయంతో పత్తిగింజలు విత్తుతున్నారు. మండల వ్యాప్తంగా ఎటూచూసినా పత్తి విత్తనాలు విత్తే కూలీలే కనిపిస్తున్నారు.

గతేడాది కలిసిరాని ఖరీఫ్

మండలంలో గత ఖరీఫ్ సీజన్ పత్తిపంట సాగు చేసిన రైతులకు కలిసిరాలేదు. పత్తిపంటలో చీడపీడలు (గులాబీరంగు పురుగు) సోకి ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తిపంట సాగుపై ఆశలు పెంచుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వ్యవసాయశాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు విత్తన షాపులను తనిఖీలు చేస్తున్నారు. దీంతో విత్తన దుకాణందారులు సైతం కల్తీ, నకిలీ విత్తనాలకు తావివ్వకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారు. సరైన వర్షం కోసం ఎదురుచూడగా గురువారం కురిసిన మోస్తరు వర్షానికి చదును చేసిన భూముల్లో అచ్చుతోలుతూ కూలీల సహాయంతో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ పనులు జోరందుకున్నాయి.

మండలంలో సాగు భూమి వివరాలు..

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు మరో నాలుగు అనుబంధ గ్రామాలు ఉండగా మొత్తం 24వేల ఎకరాలు సాగు భూమి ఉంది. ఇందులో 18వేల ఎకరాల్లో వరిపంట, 4,200 ఎకరాల్లో పత్తిపంట, 300 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 300 ఎకరాలు మామిడి, మిగతా భూముల్లో ఇతర పంటలు సాగు అవుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో 10 గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండగా మరో 9 గ్రామాలు ఎస్సారెస్పీ కాల్వ కింద ఉన్నాయి. కాగా రోహిణి కార్తె ఆరంభంలోనే వరిపంట సాగుచేసే రైతులు.. పొలాల్లో సేంద్రియ ఎరువులు చల్లి నారుమడులు పోశారు. మరికొంత మంది రైతులు భూసార పెంపుకోసం జీలుగ విత్తనాలు చల్లి ఉంచారు. కొన్నిరోజుల్లో రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధం కానున్నారు.

వేలేరులో..

వేలేరు : రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వరినార్లు పోయడం, పత్తి విత్తనాలు విత్తుకోవడంలో నిమగ్నం అవుతున్నారు. వాతావరణం చల్లబడడంతో రైతులు వ్యవసాయ పనులపై దృష్టి సారిస్తున్నారు. పత్తి విత్తనాలు విత్తడం, నార్లు పోయడం జోరందుకోవడంతో కూలీలకు చేతినిండా పనిదొరుకుతోంది. ఇన్ని రోజులు ఎండ వేడిమితో నిర్మానుష్యంగా మారిన దుకాణాలు తొలకరి జల్లుతో రైతులతో కళకళలాడుతున్నాయి.



ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాడెడ్లతో అచ్చుతోలుతున్న రైతు



వేలేరు : పీచరలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

వర్షాలు కురిసిన తర్వాతే విత్తాలి

మరో రెండు, మూడు వర్షాలు కురిసిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని. ఇప్పుడే భూమిలో వేడి తగ్గదు. ఒక్క వర్షం పడగానే రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దు. మరో రెండు వర్షాలు పడేంత వరకు ఓపిగా పట్టాలి. మళ్లీ ఎండలు కొడితే నాటిన విత్తనాలు మొలుకెత్తక నష్టపోయే ప్రమాదం ఉంది.

- రాజ్‌కుమార్, ఏఓ

ఆర్‌ఎంపీ నిర్లక్ష్యమా.. అనారోగ్యమా?

- వృద్ధురాలి చెయ్యి తొలగించాల్సిన పరిస్థితి
- ఆర్‌ఎంపీనే కారణమంటున్న బాధితురాలి కుమారుడు

ఐనవోలు: వైద్యం చేసిన ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనా? లేక అనారోగ్య కారణాల వల్లనో తెలియదు కానీ మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గందెపెల్లి ఉప్పలమ్మకు ఎడమ చేయి తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉప్పలమ్మ కొడుకు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న గురువారం ఉప్పలమ్మ అస్వస్థతకులోనై వాంతులు చేసుకుంది. ఊళ్లో అందుబాటులో ఉన్న ఆర్‌ఎంపీని వైద్యం నిమిత్తం ఇంటికి పిలిచారు. ఈక్రమంలో ఆర్‌ఎంపీ.. ఉప్పలమ్మ ఎడమ చేతికి సెలైన్ బాటిల్ ఎక్కించాడు. క్రమంగా చేయి నల్లబడడంతో ఆర్‌ఎంపీతో కలిసి ఉప్పలమ్మ, ఆమె కుమారుడు రాజు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు వెళ్లారు. నిమ్స్‌లో పరీక్షించిన వైద్యులు వృద్ధురాలి చేతిని తొలగించాలని చెప్పారు. అందుకు గల కారణాలు మాత్రం స్పష్టంగా చెప్పలేదు. రాజు అభ్యర్థన మేరకు వరంగల్ ఎంజీఎంకు నిమ్స్ వైద్యులు సిఫారసు చేశారు. పరీక్షలు చేసిన ఎంజీఎం వైద్యులు.. ఆర్‌ఎంపీ సరిగ్గా గ్లూకోజ్ పెట్టక పోవడం వల్లే చేయి తొలగించాల్సిన పరిస్థితి వచ్చిందని రాజుతో చెప్పారు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగి ఉంటుందని భావిస్తున్నట్లుగా రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత సదరు ఆర్‌ఎంపీని ప్రశ్నించనున్నట్లు అతడు తెలిపాడు.



నల్లగా మారిన ఉప్పలమ్మ చెయ్యి

జిల్లాలో మోస్తరు వర్షం

హన్మకొండ: జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాల్ని ప్రణాళిక శాఖ విడుదల చేసింది. సగటున 10.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమదేవరపల్లిలో 54.8 మిల్లీమీటర్లు, వేలేరులో 2.7, ఎల్కతుర్తిలో 19.3, కమలాపూర్‌లో 1.2, హసన్‌పర్తిలో 1.5, ధర్మసాగర్ 18.8, కాజీపేటలో 5.6, హనుమకొండలో 2.4, పరకాలలో 5.6, దామెరలో 9.7, ఆత్మకూరులో 9.4, శాయంపేటలో 13.4, నడికూడలో 3.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'కడియం'ను కలిసిన నాయకులు

వేలేరు : వరంగల్ ఎంపీగా విజయం సాధించిన కడియం కావ్యను, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎంపీ ఎన్నికల్లో కావ్య గెలుపు సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేస్తామని అన్నారు. మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, గట్టయ్య కలిసినవారిలో ఉన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఆర్‌బీఎస్‌కే టీంలకు టూల్ కిట్లు



గీసుకొండ: పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ టీంలకు 14 రకాల పరికరాలతో కూడిన కిట్‌లను అందిస్తున్నామని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకరటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టీంలకు శుక్రవారం కిట్‌లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కిట్‌లలోని పరికరాలతో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. జిల్లాలో ఐదు మొబైల్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



కృష్ణమూర్తి, సుధాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో గురువారం జరిగిన తెలంగాణ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వారికి ప్రాధాన్యం లభించిందని రైల్వే రిటైర్డ్ నాయకుడు, హనుమకొండ వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ అనుమాల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు వారిని సన్మానించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కాజీపేటకు చెందిన ఎం.కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మహబూబాబాద్‌కు చెందిన ఎం.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.